క్లుప్తంగా

డీఈఓ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

కొయ్యలగూడెం: డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం కొయ్యలగూడెం కన్నాపురం హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పోలవరం శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు కలెక్టర్ వెట్రిసెల్వీతో వెళ్లిన ఆమె తిరుగు ప్రయాణంలో హైస్కూళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు అమలవుతున్న విద్యా విధానాలను పరిశీలించి విద్యార్థులతో ఆమె సంభాషించారు. మెరుగైన ఫలితాలను రాబట్టే విధంగా పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆమె పలు ప్రశ్నలు వేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ



బాషా రంపాలరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏఐకేఎంఎస్ నాయకులు బాషా రంపాల రాజు కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, ఎస్సీ సెల్ మండల నాయకులు కోరం దుర్గారావు, తెల్లం భీమరాజు, ఉండవల్లి సురేష్, తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడు రంపాలరాజు భార్య వెంకాయమ్మ, కుమారులు శ్యాంబాబు, రాజేష్‌లను పరామర్శించి ధైర్యం చెప్పారు.

మృతుడి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



మృతుడు సోమశేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ హోంమంత్రి వనిత

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా సోమశేఖర్ కుటుంబాన్ని మాజీ హోంమంత్రి తానేటి వనిత సోమవారం పరామర్శించారు. మృతుడి నివాస గృహానికి వెళ్లిన ఆమె సోమశేఖర్ కుమార్తె కార్తికను ఓదార్చారు. అలాగే కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కారుమంచి రమేష్, బొండాడ వెంకన్నబాబు, భోగరాజు సాయికృష్ణ, బొల్ల శ్రీను, వాసిరెడ్డి నరసింహారావు, అప్పసాని ధర్మారావు, పోలిన నారాయణరావు, వాసిరెడ్డి రామారావు, కండెపు కృష్ణారావు, మురుగుల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు సోమవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఉద్దరాజు ప్రసాద్‌రాజు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చింతలపూడి మండలం సుప్రీంపేట గ్రామంలో నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన యడ్లపాటి సునీతను అరెస్ట్ చేసి రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా బట్టువారిగూడెం గ్రామంలో దాడులు నిర్వహించి, శీలం ఏడుకొండల వద్ద నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై బెల్ట్ షాపు కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

8న మెగా లోక్‌అదాలత్

చింతలపూడి: మార్చి 8వ తేదీన నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక కోర్టు ఆవరణంలో సోమవారం న్యాయవాదులతో లోక్‌అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రోజూ ఉచిత లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నరకానికి రహదారులు

- హడలెత్తిపోతున్న ప్రయాణికులు
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు
- రోడ్లు నిర్మించాలని వేడుకుంటున్న వాహనచోదకులు



నరసన్నపాలెం రోడ్డుపై లేచిన రాళ్లు

లింగపాలెం: రహదారుల అభివద్ధికి చర్యలు చేపట్టినప్పటికీ నాణ్యతా లోపంతో అవి నిర్మించిన కొంత కాలానికి వేసిన రోడ్లపై రాళ్లు లేచి గుంతల పాలు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వెంకటాపురం–నరసన్నపాలెం మీదుగా కొత్తపల్లి వెళ్లే రోడ్డు నిర్మాణం ఎకోట్ల రూపాయలతో చేశారు. అయితే నాణ్యతా లోపంతో మూడునాళ్ల ముచ్చటగా మారింది. చంద్రన్నపాలెం నుంచి తోచలక రోడ్డులో అనేక చోట్ల మెటల్‌రాళ్లు లేచిపోవడంతో వాహదారులు, ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇవి కాక మండలంలో పాశ్యానగరం, లక్ష్మీగణపవారిగూడెం, మరికొన్ని గ్రామాలకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారని ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో అనేకసార్లు ఈ రోడ్డులో గోతుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం ఇన్ని కోట్లతో చేపట్టినప్పటికీ మెటల్ అంతా లేచిపోయి కనీసం ప్రజలు నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉండటంతో నరక యాతన పడుతున్నారు. రోడ్లు నిర్మించినప్పటికీ నాణ్యత పాటించకపోవడం, అధికారుల కాసుల కక్కుర్తి కలిపి నాసిరకం రోడ్లు నిర్మిస్తున్నారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ రోడ్డు ఇంత అధ్వానంగా తయారైనప్పటికీ సంబంధిత అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ప్రజలు, ప్రయాణికులు వారి పని తీరు పట్ల మండిపడుతున్నారు. ఈ రోడ్డు మొత్తం అనేక చోట్ల మెటల్ రాళ్లు లేచిపోవడంతో గుంతలు పడి వాహదారులు, ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి వేళల్లో అనేకసార్లు ఈ రోడ్డులో గోతుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నాణ్యతా లోపం కారణంగా రోడ్లు వేసిన కొంత కాలానికే పాడైపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టి మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

వెంటనే కొత్త రోడ్లు వేయాలి



గుంతల మయమైన రోడ్లను వెంటనే వేయాలి. రోడ్లపై వెళ్లాలంటే నరకమే. రాళ్లు లేచిపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరుచూ ప్రయాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్లు నిర్మించి, ఇబ్బందులు తొలగించాలి.

–కె.వెంకటేశ్వరరావు, శింగగూడెం

మానవత ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం: ప్రమాదంలో కంటికి గాయమైన వ్యక్తి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత సభ్యులు సోమవారం ఆర్థిక సాయమందించారు. మండలంలోని పేరంపేట గ్రామానికి చెందిన వేముల సోమరాజు కల్లుగీత కార్మికుడు. ఇటీవల చెట్టుపై ఉన్న కాయను కోస్తుండగా, కంటికి గాయమైంది. వెంటనే జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ కంటికి ఆపరేషన్ నిర్వహించారు. మరో ఆపరేషన్ నిర్వహిస్తే కంటి చూపు వస్తుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మానవత సంస్థ సభ్యులు రూ.5 వేల చెక్కు, సభ్యుల వ్యక్తిగత వితరణ ద్వారా రూ.2500 సోమరాజుకు అందజేశారు. కార్యక్రమంలో గద్దే సత్యనారాయణ, అల్లూరి రామకృష్ణ, అయినాల రమణమూర్తి, పల్లె వెంకట్‌రెడ్డి, దల్లిపెద్ద వీర్రాజురెడ్డి, త్రిపుర సుందరి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌పై దాడి అమానుషం

చింతలపూడి: పార్వతీపురం మన్యం, మక్కువ మండల ×ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై దాడి అమానుషమని జర్నలిస్ట్ సంఘాల నాయకులు అన్నారు. దాడికి బాధ్యులైన మండల టీడీపీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడును తక్షణం అరెస్ట్ చేయాలని జర్నలిస్ట్ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, సీఐ రవీంద్రనాయక్‌లను కలిసి వినతి పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో పలు జర్నలిస్ట్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిపై కఠిన చర్యలు చేపట్టాలి

కుక్కునూరు: పార్వతీపురం నియోజకవర్గం, మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై టీడీపీ నాయకుడు వేణుగోపాల్‌నాయుడు అసభ్య పదజాలంతో దూసిస్తూ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు కుక్కునూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు పేర్కొన్నారు. సోమవారం విలేకరిపై దాడిని ఖండిస్తూ నిందితుడిపై చర్యలు చేపట్టాలని కోరుతూ కుక్కునూరు తహసీల్దార్‌కు వినపతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జోగినేని హరినాద్,పెన్మత్స శ్రీనివాసరాజు,దండు నారాయణరాజు, తుంగపాటి శ్రీనివాసరావు, చాంద్‌పాషా, మాచర్ల పోతురాజు, దావుద్, వేణు, వలీపాషా, రహీం, రమేష్ ,విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

తహసీల్దార్‌కు వినతిపత్రం

కామవరపుకోట: పార్వతీపురం మన్యం జిల్లాలోని మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై టీడీపీ నాయకుడి దాడికి నిరసనగా కామవరపుకోట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జి.ఎలీషాకు సోమవారం మండల విలేకరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి అధికారులకు మధ్య వారధిగా ఉంటూ సమస్యలను వెలుగులోకి తెచ్చే విలేకరులపై దాడులు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని విలేకర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు హ్యాండ్ మైక్ బహూకరణ

జంగారెడ్డిగూడెం: పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఎంఈవో బి.రాముడు అన్నారు. బాలాజీ నగర్ ఎంపీపీ పాఠశాలకు డాంగేనగర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో హ్యాండ్ మైక్‌ను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో–1 బి.రాముడు, ఎంఈవో జి.శ్రీరాములతో కలిసి మాట్లాడుతూ పేదల ప్రాంతాలలో చైతన్య, సేవా కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనందిస్తున్న డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం సేవా కార్యక్రమాలను అభినందించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు అమృతల రంగా మాట్లాడుతూ సంఘ ఉపాధ్యక్షులు లింగంగుంట శ్రీనివాస్, ఉషారాణి దంపతులు రూ. 7వేలు విలువైన హ్యాండ్ మైక్‌ను అందించారన్నారు. కార్యక్రమంలో నేలపోలు ప్రభాకర్, కె.లక్ష్మణరావు, పఠాన్‌బాజీ, ఎల్.శ్రీనివాస్ ఉపాధ్యాయ, సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు హ్యాండ్ మైక్‌ను అందిస్తున్న అంబేద్కర్ యువజన సంఘ నేతలు

మున్సిపల్ శాఖ నుంచి వేతనాలు ఇవ్వాలి

చింతలపూడి: మున్సిపల్ ఉద్యోగ కార్మికుల వేతనాల చెల్లింపు, సాంఘిక భద్రత మున్సిపల్ శాఖలకే అప్పగించాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నగర పంచాయతీ కమిషనర్ డి.పావనికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాలతో పాటు పనులు, నిర్వహణ వంటి పనులు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలన్న ప్రభుత్వ ఆలోచనలు విరమించుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటియుసి మున్సిపల్ వర్కర్స్ చింతలపూడి శాఖ అధ్యక్షురాలు వెలగాడి అనురాధ, వడిత్యబాలు ,పి నాగమణి పాదిలి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



నగర పంచాయతీ కమిషనర్ డి.పావనికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నేటి నుంచి ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని దేవులపల్లి గ్రామంలో కొలువైన పంచముఖి ఆంజనేయస్వామి వారి 16వ వార్షికోత్సవాలు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 18వ తేదీ విశ్వక్షేన పూజతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. గోపూజ, సింధూర సహిత లక్షతమలపాకుల పూజ, విశేష హోమాలు, గుడోదక తర్పణం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం సముద్రాల ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో దాసాంజనేయ పంచముఖి ఆంజనేయస్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహిస్తారు. 19వ తేదీ 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 20వ తేదీ గురువారం భారీ అన్నసమారాదన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



పంచముఖ ఆంజనేయస్వామి

అక్రమ కలప స్వాధీనం

కొయ్యలగూడెం: ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న మారుజాతి కలపను స్వాధీనం చేసుకున్నట్లు కన్నాపురం ఎఫ్ఎస్ఓ దినేష్ సోమవారం పేర్కొన్నారు. సాయంత్రం సమయంలో బుట్టాయగూడెం మండలం నిమ్మలగూడెం సమీపంలో అక్రమ కలప తరలింపు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. పట్టుకున్న కలపను, ట్రాక్టర్‌ను కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి చేర్చి సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.10 వేలకు పైగా ఉంటుందన్నారు. సిబ్బంది కేఎస్ శ్రీకాంత్, జి.వీరారెడ్డి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వెదురు కలప స్వాధీనం

అక్రమంగా తరలి వెళుతున్న వెదురు కలపను స్వాధీనం చేసుకున్నట్లు కన్నాపురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.దినేష్ పేర్కొన్నారు. కన్నాపురం అటవీ శాఖ పరిధిలోని ఉన్న మంజులూరు ప్రాంతంలో మూడు మోటార్ బైక్‌లపై కలపను తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. సంబంధిత వ్యక్తుల తోపాటు వాహనాలపై చర్యలు తీసుకుని కార్యాలయానికి తరలించి సీజ్ చేశామన్నారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.7 వేలు వరకు ఉంటుందన్నారు. బీట్ అధికారి ఆర్.నవతేజ, ప్రసాద్ బేస్ క్యాంప్ హెల్పేర్ రైడ్‌లో పాల్గొన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న కలప ట్రాక్టర్

సమస్యలపై గళమెత్తిన అంగన్‌వాడీలు



బుట్టాయగూడెం: సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



కుక్కునూరు: ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్యకర్తలు



జంగారెడ్డిగూడెం: ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది



కొయ్యలగూడెం: ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



చింతలపూడి: ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బుట్టాయగూడెం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కె.పుష్ప మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కృపామణి, టి. రామలక్ష్మి, భూదేవి, సుధ, వసుంధర, పార్వతి, వాణి, మంగతయారు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణం పరిష్కరించాలి

చింతలపూడి: అంగన్‌వాడీల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూల ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని ప్రాజెక్ట్ నాయకురాలు బి.ఫణివర్ధిని, ఎల్.ఈశ్వరి, ప్రాజెక్ట్ అధికారిణి పి.మాధవికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్.సరోజిని, కవిత, ఎ.సరళాదేవి, హేమలత, సీతామహాలక్ష్మి, ఝాన్సీ, బాబి, చెన్నకేశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం: అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ పీవో బ్యూలకు వినతిపత్రం అందజేశారు. పసల సూర్యరావు, యు.సత్యనారాయణ, సత్యవేణి, శ్యామల, శాంతి, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

కొయ్యలగూడెం: అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలని ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం సిబ్బంది ధర్నా నిర్వహించారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీఎల్ఎస్ కుమారి, జె.నాగమణి, శుక్లబోయిన రాంబాబు, ఎస్.సీత, జయలక్ష్మి, దివ్య, సీహెచ్ మణి, ఎ.జ్యోతి, పద్మజ్యోతి, రాజామణి, మాధవి పాల్గొన్నారు.

గ్రాట్యుటీ అమలు చేయాలి

కుక్కునూరు: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు కల్పించి, సమ్మె డిమాండ్లను అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కుక్కునూరు ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సీడీపీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, రాధ, మంగ, రమణ, విమల, నాగమణి, మాధవి, తులసి, శ్రీలత, గౌరి, గౌతమి, వసంత తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

పోలవరం రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఉపాధ్యాయులను ఆదేశించారు. పోలవరం మండలంలోని గూటాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోలవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సోమవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన తరగతుల నిర్వహణపై తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాలను ఆరా తీశారు.

రాజబాబు కుటుంబానికి మాజీ ఎంపీ పరామర్శ



రాజబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఏలూరు మాజీ ఎంపీ శ్రీధర్

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు అకాల మరణం చాలా బాధాకరమని ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో రాజబాబు నివాస గృహానికి సోమవారం ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాజబాబు కుమారుడు సంజయ్‌కు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోటార్ మోహన్‌రావు, మిడతా రమేష్, రంగబాబు, గడ్డం శ్రీను, అడపా శ్రీను, శీలం కృష్ణంరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవ్ నిర్వహణ

జంగారెడ్డిగూడెం: ప్రతిభా బాలోత్సవ్ మొదటి రోజు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప విద్యాధికారి రామన్న దొర, జంగారెడ్డిగూడెం తహసీల్దార్ స్లీవజోజి పాల్గొని విద్యార్థులకు సూచనలు అందించారు. విద్య పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధతో, నిబద్ధతతో వ్యవహరిస్తే విజయాలు వరిస్తాయని తెలిపారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సుభాషరెడ్డి మాట్లాడుతూ ఈ బాలోత్సవ్ వేడుకలు మూడు రోజులు నిర్వహిస్తామని చెప్పారు. తొలి రోజుగా ఐఐటీ క్యాంపస్ విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చి ఆహూతులను ఆనంద డోలికల్లో తేలించారు. కార్యక్రమంలో సరోజ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన ప్రతిభా పాటవాలను వేదికపై ప్రదర్శించే రీతిలో ఈ కార్యక్రమ రూప కల్పన చేశారని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

బుట్టాయగూడెం: మండలంలోని అంతర్వేదిగూడెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమై నిరాశ్రయులైన చోడెం రాంపండుకు సోమవారం దొరమామిడికి చెందిన ఫ్రెండ్స్ ఫర్ హెల్ప్ గ్రూప్ సభ్యులు 25 కేజీల బియ్యాన్ని రూ.2000 నగదును అందజేశారు. కార్యక్రమంలో అలివేరు ఎంపీటీసీ సభ్యులు కొవ్వాసి గోవిందరాజు, ఫ్రెండ్స్ ఫర్ హెల్ప్ గ్రూప్ సభ్యులు పఠాన్ వల్లీఖాన్, పొన్నాటి మంగారావు, కొప్పుల మధు, గ్రామపెద్దలు మల్లం లక్ష్మణకుమార్, కొక్కెర పద్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేరన్ దగ్ధం

బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో సోమవారం అగ్ని ప్రమాదంలో ఒక బేరన్ దగ్ధమైంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కె.ప్రసాద్ అనే రైతు పొగాకు బేరన్‌లో క్యూరింగ్ చేస్తుండగా సోమవారం ర్యాష్ కర్ర హీట్ గొట్టంపై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బేరన్ దగ్ధమైంది. సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల నష్టం ఆస్తి నష్టం ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ఘనంగా పుస్తకావిష్కరణ

జంగారెడ్డిగూడెం: ప్రతిభ పాఠశాల ప్రిన్సిపాల్, రచయిత్రి కాసర సరోజారెడ్డి రచించిన నిశ్శబ్ద చిత్రాలు పుస్తకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు కర్రి రామారెడ్డి ఆవిష్కరించగా, కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు, మిత్ర దత్తా, ఎంఎస్ఆర్, జెడ్పీటీసీ పోల్నాటి బాబిజ, ఆధ్యాత్మిక వేత్త కేఎల్ఎస్ ధనకుమార్, వెంకట అప్పారెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు.